సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



బాలిక మిస్సింగ్ కేసు ఛేదన


ఆగిరిపల్లికి చెందిన తల్లిదండ్రులు తమ కుమార్తె మిస్సింగ్‌పై దిశ యాప్‌కు సమాచారమిచ్చారు. రెండు గంటల్లోనే బాలికను సురక్షితంగా అప్పగించారు. 8లో ▸



పాక్షిక సేంద్రియ సేద్యం

వరిలో ఎరువులు, పురుగుమందులు తగ్గించి అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం చైతన్యం తీసుకువస్తోంది. పాక్షిక సేంద్రియ సేద్యంపై అవగాహన కల్పిస్తోంది. 8లో ▸

నంది వాహనంపై ఊరేగిన శివయ్య



ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి గురువారం రాత్రి నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపారు.

న్యూస్‌రీల్

భక్తి శ్రద్ధలతో పవిత్రోత్సవాలు



స్వామివారికి పవిత్రాలు సమర్పిస్తున్న అర్చకులు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నాలుగో రోజైన గురువారం స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు సింహాద్రి అప్పలాచార్యులు, నరసింహాచార్యులు, వేదపండితులు ఫణికుమార్ శర్మ వెంకటరమణ ఆచార్యత్వమున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్వేద స్వస్తి, విశ్వక్సేనపూజ, యాగశాలార్చన, ప్రాయశ్చిత్త, నరసింహ సుదర్శన హోమాలు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. సాయంత్రం స్వామికి యాగశాల అర్చన, పంచసూక్త హవనాలు, పవిత్ర విసర్జన కుంభ ప్రోక్షణ మహా పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెనుమంట్రలో నేడు జగనన్నకు చెబుదాం

పెనుమంట్ర: పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13న ఉదయం 10 గంటల నుంచి మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు ఉదయం పది గంటల నుంచి స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఎస్ రామ సుందర్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్ ఆర్డీవో, డీఆర్వో కె కృష్ణవేణి, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి నేరుగా సమర్పించవచ్చన్నారు.

విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

సాక్షి, భీమవరం: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎం.నర్సింహమూర్తి తెలిపారు. 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనరల్ కోర్సుల్లో 2,408 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సుల్లో 826 మంది విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు. 15 లోపు విద్యార్థులు తమకు దగ్గర్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు సందేహాల నివృత్తి కోసం 08812 230197 నెంబరులో సంప్రదించాలని కోరారు.

మందుల షాపుల్లో డిజిటల్ రికార్డులు తప్పనిసరి

తణుకు: ఉమ్మడి జిల్లాలోని మందుల షాపుల్లో ఇకపై డిజిటల్ రికార్డులు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఔషధ నియంత్రణ పరిపాలన అడిషనల్ డైరెక్టర్ హరిపరసాద్ పేర్కొన్నారు. మందుల దుకాణాల్లో కేవలం ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలన్నారు. నార్కోటిక్ మందుల విక్రయాలు అరికట్టేందుకు ఇకపై ప్రతి మందుల దుకాణాల్లో డిజిటల్ రికార్డులతో పాటు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) చట్టం ప్రకారం కచ్చితంగా మందుల షాపుల యజమానులు అమల్లోకి తీసుకురావాలన్నారు. ఇప్పటికే అన్ని అసోసియేషన్లు, మందుల షాపులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 4,500 షాపుల్లో మార్పులు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలోని నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపామని చెప్పారు. మూడు కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి నార్కోటిక్ డ్రగ్స్ విక్రయిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

14 నుంచి దసరా సెలవులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ నెల 14 నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెలవులు ఈ నెల 24 వరకూ ఉంటాయని, తిరిగి ఈ నెల 25న పాఠశాలలు పునఃప్రారంభించాలని ఆదేశించారు. మిషనరీ పాఠశాలలకు ఈ నెల 21 నుంచి 24 వరకూ సెలవులు వర్తిస్తాయన్నారు.

సొంతింటి కల సాకారం

- దువ్వలో జగనన్న కాలనీలో గృహోత్సవాలు
- ప్రారంభించిన మంత్రి కారుమూరి, కలెక్టర్



దువ్వ జగనన్న కాలనీలో ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి



గృహ ప్రవేశం చేసిన కుటుంబానికి నూతన వస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. జగనన్న కాలనీల ప్రారంభోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోటలో గృహోత్సవాన్ని ప్రారంభించగా.. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వలో జరిగిన గృహోత్సవాల్లో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సభలో మంత్రి మాట్లాడుతూ పేదలకు అవసరమైన ఇళ్లు, విద్య, వైద్యం ప్రజల ముంగిటకే చేర్చిన గొప్ప ప్రభుత్వానికి ప్రజలకు అండగా నిలవాలన్నారు. ప్రతి పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా రూ. 55 వేల కోట్లతో 72 వేల ఎకరాల భూములు సేకరించి ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు. విద్యుత్ వంటి సౌకర్యాలకు వేల కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారని చెప్పారు. ఒక్క దువ్వ గ్రామంలోనే గత టీడీపీ పాలన ఐదేళ్లలో రూ. 47 కోట్లను ఖర్చు చేయగా, ప్రస్తుతం ప్రభుత్వం నాలుగేళ్లలో రూ.197 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. గతంలో ఏదైనా పని కావాలంటే జన్మభూమి కమిటీలు ద్వారానే జరిగేవని, ప్రస్తుతం వలంటీర్ల వ్యవస్థ ద్వారా గడప వద్దకే పథకాలన్నీ వస్తున్నాయన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు ప్రజా ధనాన్ని దోచుకున్నాడని, అన్ని ఆధారాలతో దొరికి ఇప్పుడు రాజమండ్రి జైలులో ఉన్నారన్నారు.

హైవే పక్కనే ఇళ్లు

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ దువ్వ గ్రామంలోని జగనన్న కాలనీ జాతీయ రహదారి పక్కనే ఇంటి స్థలాలు లభించడం చాలా అదృష్టమన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలంతా అభివృద్ధి చెందాలనే తపనతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ పేదలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు.

28 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి

కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోని జగనన్న కాలనీల్లో 28 వేలకు పైగా గృహ నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. జిల్లాలో లక్ష 5 వేల ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఎక్కువగా పంట పొలాలు సేకరించడంతో వాటిని మెరక చేసి రోడ్లు వేశామని చెప్పారు. త్వరలోనే అంగన్‌వాడీ సెంటర్, పాఠశాల భవనాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ముందుగా దువ్వ గ్రామంలోని జగనన్న కాలనీ స్వాగత ద్వారం వద్ద శిలాఫలకాన్ని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కలెక్టర్ పి ప్రశాంతి ఆవిష్కరించారు. అనంతరం కొత్తగా నిర్మించుకున్న గృహాలను మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా గృహ ప్రవేశం చేసిన కుటుంబాలకు మంత్రి నూతన వస్త్రాలు, తాంబూలాలు అందజేశారు. జాయింట్ కలెక్టర్ సుందరరామిరెడ్డి, ఆర్డీవో కె చిన్నయ్య, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సర్పంచ్ అడ్డా బాబు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, భరణి ప్రసాద్, తణుకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ ఆర్‌సీహెచ్ ఆనంద్, డీఈఈ ప్రసాద్, తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల తీరింది



మా కుటుంబానికి సొంత ఇల్లు లేకపోవడంతో ఆ కల తీరదేమోననే భయంతో బతికే వారం. మాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకంలో సొంతిల్లు వచ్చింది. గతంలో అనేక అద్దె ఇళ్లు మారడంతో అడ్రస్ తరచూ మారిపోతూ వుండేది. ప్రభుత్వం జగనన్న కాలనీ ద్వారా సొంత ఇళ్ల కట్టుకోవడంతో ఇక మా అడ్రస్ జగనన్న కాలనీగా చిరస్థాయిగా ఉంటుంది.

– ఆకుల దుర్గాదేవి, లబ్ధిదారు, దువ్వ, తణుకు మండలం

అద్దె ఇంట్లో ఎన్నో బాధలు

గత 20 ఏళ్లుగా దువ్వలో అద్దె ఇంట్లో వుంటున్నాం. నా భర్త వికలాంగుడు కావడం, మా మవయ్య చనిపోతే శవాన్ని ఇంట్లోకి తీసుకు రానీయకపోవడం ఎంతో బాధ కలిగించింది. దీంతో సొంతిల్లు ఎలా వస్తుందోనని ఆందోళనతో ఉండగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడం నవరత్నాల పథకంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో మాకు ఇంటిస్థలం రావడంతో ఇంటిని నిర్మించుకున్నాం.

– త్రొవ్విడి వెంకటలక్ష్మి, దువ్వ, తణుకు మండలం

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం

ఉప ముఖ్యమంత్రి కొట్టు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక లక్ష్మీ ప్రియ ఎస్టేట్ మున్సిపల్ పార్కులో గురువారం ఏర్పాటు చేసిన కాపునేస్తం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎ.శామ్యూల్ అధ్యక్షత వహించారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ హామీ ఇవ్వని పథకాలను అమలు చేశారని కొనియాడారు. కాపు నేస్తం పథకం ఇచ్చిన హామీలలో లేదన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వారి ఆర్థిక ఇబ్బందులను గుర్తించి పథకాన్ని అమలు చేసి వారికి ఆర్థిక చేయూత ఇచ్చారన్నారు. మంత్రి వర్గ కూర్పులోను అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిదే అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కాపు సామాజిక వర్గం వారు ఎక్కువగా ఉన్నారని వారికి సముచితస్థానం కల్పించాలనే ఉద్దేశంతోనే తనకు ఉపముఖ్యమంత్రి పదవి తనకు ఇచ్చారని చెప్పారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి ఉప ముఖ్యమంత్రి పదవులిచ్చి ఆయా సామాజిక వర్గాలను ముఖ్యమంత్రి జగన్ గౌరవించారన్నారు. విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి విద్యాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని అన్ని రహదారులు, డ్రైనేజీలు ఎన్నికల్లోపు పూర్తి చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గంలో 16 వేల మందికి ఇళ్లు ఇచ్చామని చెప్పారు. చిల్డ్రన్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియాలు నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహనరెడ్డిని గెలిపించాలని చెప్పారు.

విద్యాభివృద్ధికి కృషి చేశాం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. ఉద్యాన వర్సిటీ, పాలిటెక్నిక్ కళాశాల, నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లను తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చామని... రౌడీయిజాన్ని అణిచేవేసి పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

రహదారులను అభివృద్ధి చేశాం

పట్టణంలో విశాలమైన రహదారులను నిర్మించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశామని చెప్పారు. రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి విశాలమైన రహదారులు నిర్మించడంతో రాకపోకలు సజావుగా సాగుతున్నాయన్నారు. సెకండ్ ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య చాలా వరకు పరిష్కారమైందని తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల పరిషత్ అధ్యక్షులు పొనుకుమాటి శేషులత, దాసరి హైమావతి, జెడ్పీటీసీలు ముత్యాల ఆంజనేయులు, ఉప్పులూరి వరలక్ష్మి, వైఎస్సార్‌సిపి నాయకులు బోణం విజయనిర్మల, పత్సమట్ల సావిత్రి, నూనె రాధాకుమారి, కొలుకులూరి ధర్మరాజు, కొట్టు విశాల్, కర్రి భాస్కరరావు, గుండుబోగుల నాగు, గుండు మోగుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలులో గర్భిణీ ప్రసవం

గూడెంలో రైలు ఆపి 108లో చికిత్స



108లో తల్లీ బిడ్డకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం: నెలలు నిండకుండానే ఒక మహిళ రైలులో బిడ్డకు జన్మనిచ్చిన ఘటన గురువారం రాత్రి తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఎర్నాకులం–హతియా ఎక్స్‌ప్రెస్ బీ 13 బోగీలో సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్న రష్మిక అనే 23 ఏళ్ల మహిళకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే ఈ విషయాన్ని ఆమె దగ్గరే ఉన్న భర్తకు తెలియజేసింది. ఆ సమయానికి రైలు తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. రైలుకు గూడెంలో హాల్టు లేదు. మహిళ విషయాన్ని తెలుసుకున్న రైల్వే సిబ్బంది రైలును గూడెంలో ఆపడానికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు సమాచారాన్ని తాడేపల్లిగూడెంలో ఉన్న 108 అంబులెన్సుకు చేరవేశారు. ఈ రైలు స్టేషన్‌లో ఆగుతున్న సమయంలో 108 సిబ్బంది స్టేషన్‌కు అంబులెన్సు స్ట్రైచర్‌తో సహా చేరుకున్నారు. రైలు స్టేషన్ దాటి శివాలయం ప్రాంతంలో ఆగింది. వెంటనే సమాచారం 108 సిబ్బందికి అందింది. దీంతో వెంటనే సిబ్బంది అంబులెన్సును శివాలయం ప్రాంతానికి తీసుకెళ్లారు. బోగీలో ఉన్న రష్మికకు వైద్య సాయం అందిస్తున్న సమయంలో డెలివరీ కావడంతో వెంటనే వైద్య సాయం అందజేశారు. ఏడో నెలలో రష్మిక బిడ్డకు జన్మనివ్వడం, బిడ్డ బరువు కిలోకు మించి లేకపోవడంతో తల్లీబిడ్డను అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరుకు తరలించారు. అంబులెన్సు పైలట్ నీలపాల దినేష్ , ఈఎంటీ అనూష, రైల్వే పాయింటు మెన్స్ సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 23న గీతా జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు భగవద్గీత కర్మ యోగం(1 నుంచి 30 శ్లోకాల వరకు) మూడో అధ్యాయంపై కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నామని హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ బీఎస్‌ఆర్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతుల విద్యార్థులకు జూనియర్స్, 8, 9 తరగతుల విద్యార్థులకు సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ బహుమతిగా రూ. 1000, ద్వితీయ బహుమతిగా రూ. 750, తృతీయ బహుమతిగా రూ. 500 నగదు రూపంలో ఇస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి జూనియర్స్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సీనియర్స్ విభాగాలకు ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఏలూరులోని రామచంద్ర రావు పేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో డిసెంబర్ 10న పోటీలు జరుగుతాయన్నారు. సంపూర్ణ భగవద్గీత (18 అధ్యాయాలు) కంఠస్థ పోటీలు డిసెంబర్ 9న ఇదే వేదికపై నిర్వహిస్తమన్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి డిసెంబర్ 17న తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని అమ్మనాంబ ఆశ్రమంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఇతర వివరాలకు 9492941754 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

14, 15 తేదీల్లో ఎస్సై రాతపరీక్షలు

ఏలూరు టౌన్: ఎస్సై మెయిన్స్ రాతపరీక్షలకు సర్వం సన్నద్ధం చేసినట్లు ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మెయిన్స్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డీ.మేరిప్రశాంతి, అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కర్ ఉన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో ఎస్సై పోస్టుల భర్తీకి సంబంధించి తుది మెయిన్స్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ చెప్పారు. నగరంలో ఎస్సై మెయిన్స్ పరీక్షకు 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పరీక్షల్లో నాలుగు పేపర్లు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏలూరు శివారు వట్లూరులోని సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, సీఆర్‌ఆర్ మహిళా కళాశాల, కొత్తబస్టాండ్ సమీపంలోని సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల, ఆర్‌ఆర్ పేటలోని సెయింట్ థెరిస్సా కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు ఏలూరు రేంజ్ పరిధిలో 4,162 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని డీఐజీ తెలిపారు.

భీమవరం రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం



టౌన్ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్‌ఎం

భీమవరం (ప్రకాశంచౌక్): డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ గురువారం భీమవరం టౌన్, జంక్షన్ రైల్వే స్టేషన్లను పరిశీలించారు. స్టేషన్‌లోని హెల్త్ యూనిట్స్, బుకింగ్ ఆఫీస్, సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ భారత్ పథకంలో భాగంగా భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఎంపికైందని.. ఈ పథకంలో స్టేషన్‌లో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు, ప్లాట్‌ఫాం డెవలప్‌మెంట్ తదితర పనులను చేపట్టడానికి ఉన్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో సేఫ్టీ సౌకర్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎం వి.రాంబాబు, డీఓఎం డి.నరేంద్ర వర్మ, డీఈఈ కె.శ్రీనివాస్, టి.సురేష్, డీఈఈఎస్ కె.శ్రీధర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

పాలకొల్లు స్టేషన్ పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణ రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్రతి సమస్య త్వరలో పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని డీఆర్‌ఎం నరేంద్ర పాటిల్ అన్నారు. పాలకొల్లు విచ్చేసిన ఆయనకు డీఆర్‌యుసిసి మెంబర్ జక్కంపూడి కుమార్ పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విజయవాడ–హుబ్లీ ట్రైన్‌ను నరసాపురం నుంచి ప్రారంభమయ్యేలా చూడాలన్నారు.

సారాపై పోరు

- దాదాపు 115 గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు బంద్
- సత్ఫలితాన్నిస్తున్న ఎస్‌ఈబీ కార్యాచరణ
- స్వయం ఉపాధి వైపు మళ్లేలా అవగాహన

ఏ కేటగిరీలో	గతంలో 16 గ్రామాలు	ప్రస్తుతం 3 గ్రామాలు
బీ కేటగిరీలో	గతంలో 45 గ్రామాలు	ప్రస్తుతం 1 గ్రామం
సీ కేటగిరీలో	గతంలో 62 గ్రామాలు	ప్రస్తుతం 4 గ్రామాలు



గ్రామాల్లో నాటుసారా ధ్వంసం చేస్తోన్న ఎస్‌ఈబీ అధికారులు(ఫైల్)

ఏలూరు టౌన్: సమాజాన్ని పట్టిపీడిస్తోన్న మహమ్మారుల్లో నాటుసారా ఒకటి... అమాయక గిరిజనం నాటుసారా మత్తులో విలువైన జీవితాలను కోల్పోతున్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తోన్న అక్రమార్కులు మాత్రం తమ జేబులు నింపుకుంటున్నారు. ఏలూరు జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక ప్రణాళికతో పనిజేస్తోంది. రాష్ట్ర సర్కారు నాటుసారా, గంజాయి, మత్తుపదార్థాలు, అక్రమ మద్యం రవాణా నిరోధానికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ఎస్‌ఈబీ చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలు ఇస్తున్నాయి. గతంలో జిల్లాలో ఏ, బీ, సీ కేటగిరీలో 123 గ్రామాలు ఉండగా, తాజాగా అవి సింగిల్ డిజిట్‌కు చేరటం ఎస్‌ఈబీ పనితనానికి నిదర్శనం. ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్, అదనపు ఎస్పీ నక్కా సూర్య చంద్రరావు నేతృత్వంలో జిల్లాలో నాటుసారా నిర్మూలనకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. జిల్లాలో నాటుసారా నిర్మూలనలో రాష్ట్రస్థాయిలో బెస్ట్ జిల్లాగా అవార్డును అందుకుంది.

123 నుంచి 8 గ్రామాలకు

ఏలూరు జిల్లాలో పలు గ్రామాలను నాటుసారా తయారీ, రవాణా, విక్రయాల ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. 'ఏ' కేటగిరీలో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు, 'బీ' కేటగిరీలో నాటుసారా తయారీ, రవాణా, ' సీ' కేటగిరీలో నాటుసారా విక్రయాలు.. ఇలా మూడు కేటగిరీలుగా విభజించారు. ఈ మూడు కేటగిరీల్లో 123 గ్రామాలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 8 గ్రామాలకు చేరాయి.

నాటుసారా తయారీపై ఉక్కుపాదం

ఏలూరు జిల్లాలో నాటుసారా తయారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఉక్కుపాదంతో అణిచివేసింది. ఒకవైపు సామాజిక పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతులను చేస్తూనే మరోవైపు కఠిన నిర్ణయాలతో వారిలో మార్పునకు కృషి చేస్తోంది. చెక్‌పోస్టులు, గ్రామాల్లో నిఘా, అరెస్టులతో నాటుసారా తయారీ, విక్రయాలను నిలువరిస్తోంది. బైండోవర్ కేసులతోపాటు, ఏకంగా మరోసారి తప్పు చేయకుండా రూ.2 లక్షల వరకూ జరిమానాలు విధిస్తూ ఉండడంతో ఆర్థికంగా నాటుసారా వ్యాపారంపై ఆసక్తి సన్నగిల్లుతుంది. ఇక బెల్లం విక్రయించే వ్యాపారులపై కొరడా ఝుళిపించటం, ఏలూరు జిల్లాలో 11మందిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం, గ్రామ బహిష్కరణలు, ఆస్తుల జప్తు వంటి విధానాలతో మెల్లగా వారిలో మార్పు ప్రారంభమైంది.

64 కుటుంబాలకు ఉపాధి కల్పన

అమాయక గిరిజనులకు నాటుసారా తయారీ, వ్యాపారంతో కలిగే అనర్థాలను, ఆర్థిక, సామాజిక ఇబ్బందులపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు చేపడుతున్నారు. ఈ ఏడాది గిరిజన ప్రాంతాల్లో నాటుసారా వ్యాపారానికి దూరంగా ఉండేలా 64 కుటుంబాల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఈ కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు 64 కుటుంబాలకు రూ.78 లక్షల వరకూ రుణాలు అందజేశారు. కిరాణా దుకాణాలు, పశువుల పెంపకం, గొర్రెలు, ఇతర చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవించేలా ప్రోత్సహిస్తున్నారు.

పరివర్తన్‌తో సత్ఫలితాలు



ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఏలూరు జిల్లాలో నాటుసారా నిర్మూలన పటిష్టమైన ప్రణాళికతో పనిచేస్తున్నాం. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి నేతృత్వంలో గ్రామాల్లోని ప్రజలకు నాటుసారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ పరివర్తన్ కార్యక్రమంతో మార్పు తీసుకువస్తున్నాం. ఒకవైపు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటూనే మరోవైపు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ కార్యాచరణ ప్రణాళికతో పనిచేయటంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఏబీసీ కేటగిరీల్లో 123 గ్రామాలు ఉంటే ..నేడు 8 గ్రామాలకు కట్టడి చేయగలిగాం. బెల్లం వ్యాపారులకు అవగాహన కల్పించాం. ప్రజల జీవనశైలిలో మార్పులు రావటం విశేషం.

– నక్కా సూర్యచంద్రరావు, ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్, అదనపు ఎస్పీ

క్లుప్తంగా

ముగిసిన పవిత్రోత్సవాలు



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అనంతరం యాగశాలలో పంచసూక్త హవనం, కుంభ ఆరాధన నిర్వహించి తదుపరి పవిత్ర అవరోహణ గావించారు. తరువాత యాగశాలలో మంగళ వాయిద్యాలతో భక్తుల గోవింద నామస్మరణలతో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వైదిక కార్యక్రమములు నిర్వహించిన పానంగిపల్లి సత్యపవన కుమారాచార్యులు బృందాన్ని ఈఓ మానికల రాంబాబు శేషవస్త్రాలతో సత్కరించారు.

15 నుంచి రైల్వే గేటు మూత

కైకలూరు: రైలు పట్టాల మరమ్మతుల కోసం కైకలూరు–మండవల్లి రైల్వే ట్రాక్‌లో లెవిల్ క్రాసింగ్ 82 (కైకలూరు–కలిదిండి) గేటును మూసివేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎం.శివప్రసాద్ గురువారం చెప్పారు. ఈ నెల 15వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 17వ తేదీ రాత్రి 7 గంటల వరకు గేటు మూసివేస్తామన్నారు. ఈ రహదారిలో ప్రయాణించే వాహనచోదకులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

రైతుకు వరం.. పాక్షిక సేంద్రియ సేద్యం

వరి సాగులో ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించడం, అధిక దిగుబడులు సాధించడం, పెట్టుబడులు తగ్గించే లక్ష్యంతో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి రైతుల్లో చైతన్యం తీసుకువస్తోంది. దీనిలో భాగంగా పాక్షిక సేంద్రియ సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుత సార్వా పంటలో గణపవరం మండలం అప్పనపేట గ్రామాన్ని జిల్లాలో మోడల్ గ్రామంగా ఎంపిక చేసి పాక్షిక సేంద్రియ సాగు విధానం అమలు చేస్తోంది.

- పొలంబడి కింద 32 గ్రామాల్లో రైతులకు ప్రత్యేక శిక్షణ
- జిల్లాలో మోడల్ విలేజ్‌గా అప్పనపేట గ్రామం ఎంపిక
- ఎంపిక చేసిన గ్రామంలో 30 మంది రైతులతో 25 ఎకరాల్లో సేంద్రియ సాగు
- ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ



గణపవరం మండలం అప్పనపేటలో సేంద్రియ విధానంలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న వరి పైరు



పొలం బడికి హాజరైన రైతులు



డ్రోన్ ద్వారా వేప మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రజలకు వ్యాధులు ప్రబలడానికి ప్రధానంగా వాతావరణ కాలుష్యంతో పాటు పంటల్లో ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వినియోగించడం ఓ కారణం. వాతావరణ కాలుష్య నివారణకు ప్రభుత్వపరంగా అనేక చర్యలు చేపట్టగా, వ్యవసాయంలో ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వాలు రైతులకు అవగాహన కల్పిస్తున్నాయి. ఇటీవల ప్రజల్లో ఆర్గానిక్ ఉత్పత్తులపై మక్కువ పెరగడంతో తమ అవసరాలకు సరిపడా ధాన్యం పండించుకోవడంతో పాటు ఆకుకూరలు, కూరగాయలను కూడా సేంద్రియ పద్ధతుల్లో పండించుకోవడం ప్రారంభించారు. తమ అవసరాలకు మించి పండించే కూరగాయలు, ఆకుకూరలను ఇతరులకు విక్రయించడంతో సేంద్రియ పంటలకు గిరాకీ పెరిగింది.

20 మండలాల్లో 32 గ్రామాల్లో..

వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులను పాక్షిక సేంద్రియ వరి సాగు చేపట్టేలా ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలోని 20 మండలాల్లో పొలంబడి పేరుతో 32 గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో 30 మంది రైతులతో కూడిన 25 ఎకరాలను ఎంపిక చేసి వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.

సాగు ఇలా..

పాక్షిక సేంద్రియ సాగులో విత్తనశుద్ధి దశ నుంచే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. వరినాట్లు వేసే ముందుగానే ఎకరాకు నిర్దేశించిన మోతాదులో అంటే డీఏపీ 50 కిలోలు, సింగిల్ సూపర్ ఫాస్పేట్ 75 కిలోలు, పొటాష్ 25 కిలోలు, సుమారు 23 కిలోల యూరియా ఒకేసారి ఆఖరిదమ్ములో వేస్తారు.

పురుగుమందుల పిచికారీకి దూరంగా..

వరిసాగులో నాట్లు వేయడానికి బెంగాల్ పద్ధతిలో నాట్లు పైపైనా వేసేలా ఎక్కువ కుదుర్లుకు ప్రాధాన్యత ఇస్తారు. పైరుపై ఎటువంటి పురుగుమందులు పిచికారీ చేయకుండా చర్యలు తీసుకుంటారు. పైరుపై ప్రధానంగా ఆశించే కాండం తొలుచుపురుగు నివారణకు ఆకులపై ఏర్పడిన శిలీంద్రాలను గుర్తించడం, పొడతెగులు ఆశించకుండా గట్లును ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం వంటి పద్ధతులను అవలంభిస్తారు.

ఎంపెడా ద్వారా పంట కొనుగోలు చేసేందుకు చర్యలు

సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మంచి గిరాకీతోపాటు అధిక ధర లభించే అవకాశం ఉన్నందున వరి పంటను ఎంపెడా సంస్థ ద్వారా కొనుగోలు చేయించడానికి వ్యవసాయశాఖ చర్యలు తీసుకోనుంది.

పర్యావరణ హిత వరి సాగుకు చర్యలు



పర్యావరణహితంగా వరి సాగును ప్రోత్సహించడానికి పాక్షిక సేంద్రియ విధానంలో వరిసాగుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుత సార్వా సీజన్‌లో అప్పనపేట గ్రామాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేసి రైతులే పైరును క్షుణ్ణంగా పరిశీలించి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారు. మిత్ర, శత్రుపురుగులను వారే గుర్తించి అవసరాన్ని బట్టి పురుగుమందు పిచికారీ చేస్తారు. దీనిపై నిత్యం వ్యవసాయాధికారుల పర్యవేక్షణ ఉంటుంది. వరిసాగులో ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గిస్తే నాణ్యమైన ఉత్పత్తులతో పాటు రైతులకు పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గి వ్యవసాయం లాభాసాటిగా మారుతుంది. ఈ విధానం ద్వారా ఎకరాకు సుమారు రూ.8 వేల వరకు ఖర్చు తగ్గుతోంది.

– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన ప్రవీణ్ కుమార్

కాళ్ల: బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కాళ్ల గ్రామానికి చెందిన గుడాల ప్రవీణ్ కుమార్ (23), పాకెర్ల ప్రసంగి వ్యక్తిగత పనులపై గురువారం బైక్‌పై భీమవరం వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. సీసలి గ్రామం వద్దకు వచ్చేసరికి భీమవరం నుంచి జువ్వలపాలెం వైపు అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, ప్రసంగికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కాళ్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. గాయాలైన ప్రసంగిని 108 వాహనంలో భీమవరం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై మృతుడి తండ్రి ఏసుపాదం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్దేశించిన కోటా మేరకే పొగాకు పండించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిశేషయ్య

జంగారెడ్డిగూడెం రూరల్: పొగాకు బోర్డు నిర్ణయించిన కోటా మేరకే వర్జీనియా పొగాకును పండించాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య అన్నారు. చల్లవారిగూడెంలో నారుమడి పెంపకం, తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదిశేషయ్య మాట్లాడుతూ అనధికార బ్యారెన్‌లను నిర్మించరాదని, నాణ్యమైన పొగాకును పండించాలని సూచించారు. వేలం నిర్వహణాధికారి సురేంద్ర, పీసీసీహెచ్ లీఫ్ మేనేజర్ రఘు, ఐటీసీ ప్రతినిధి సూర్యారావు, జీపీఐ ప్రతినిధి కల్యాణ్, పొగాకు రైతు సంఘం అధ్యక్షులు సత్రం వెంకటరావు పాల్గొన్నారు.

పంట నియంత్రణతోనే నికర లాభం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు పంట నియంత్రణతోనే రైతులు నికరలాభం ఆర్జిస్తారని వర్జీనియా పొగాకు రాజమండ్రి రీజనల్ ప్రాంతీయ అధికారి ఎం.ఆదిశేషయ్య అన్నారు. గురువారం సీతంపేటలో పొగాకు రైతు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత రెండు సీజన్లో వర్జీనియా పొగాకు నియంత్రణతో కూడిన ఉత్పత్తిని సాధించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించిందని, ప్రస్తుత సీజన్‌లో కూడా అదే అమలు చేయాలని సూచించారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం అధికారి గ్రేసీ మార్గరేట్, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ ప్రశాంత్, ఫీల్డ్ ఆఫీసర్ దీపక్, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



ఉండి : పాండువ్వలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

పోటీతత్వంతో చదవాలి



మాట్లాడుతున్న కొండవేటి సత్యనారాయణ

నరసాపురం రూరల్: విద్యార్థులు పోటీతత్వంతో చదివి అవకాశాలను అందుకోవాలని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కొండవేటి సత్యనారాయణ అన్నారు. గురువారం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభం సందర్భంగా విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహించారు. చైర్మన్ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి (త్రినాథ్), డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ సబ్జెక్టుపై పట్టు సాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ పండరీనాథ్, ఎంసీఏ, ఎంబీఏ విభాగ అధిపతులు గ్రేస్, కుమార్ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో గురువారం కౌశల్ దీక్షణత సమారోహ్ స్కిల్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్–2023లో ఉత్తీర్ణులైన వారికి ఆకివీడు రూరల్ సీఐ ఎన్ వీవీ సత్యనాయణ, కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు సర్టిఫికెట్లు అందజేశారు. ట్రైనింగ్ అధికారి టీ శ్రీనివాసరావు, ఎం.రాంప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

పెదవేగి/ఏలూరు టౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వంగూరుకు చెందిన ఉదయ్ కిరణ్ ఏలూరులోని డీఎల్టీసీ (ఐటీఐ)లో డీజిల్ మెకానిక్ కోర్సు నేర్చుకుంటున్నాడు. గురువారం ఉదయం ఉదయ్ కిరణ్ ద్విచక్రవాహనంపై బి.సింగవరానికి చెందిన స్నేహితుడు పల్లెపాముల చరణ్‌ను తీసుకుని ఏలూరుకు బయలుదేరాడు. జానంపేట సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి ఆటోను ఢీకొట్టి పడిపోయారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న ఉదయ్ కిరణ్ (19) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో చరణ్‌కు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకుని ఉదయ్‌కిరణ్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న సురక్ష



తణుకులో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి, కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వున్న సచివాలయాల ద్వారా ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం తణుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి సందర్శించి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అందరికీ ఆరోగ్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో వైద్యులు ప్రజల ఇంటి వద్దకు వచ్చి పరీక్షలు చేసిన దాఖలాలు లేవని, మొదటిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి పేదరికం అడ్డుకాకూడదని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజలు హాజరయ్యేలా అధికారులు, వలంటీర్లు, సిబ్బంది కృషి చేయాలన్నారు. సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి డేటా సేకరించినట్లైతే సురక్ష కేంద్రాలకు ఎక్కువ మంది హాజరవుతారని చెప్పారు. ఇంటింటికి వెళ్లినప్పుడు ఏ ఇంటికైనా తాళం వేసినట్లైతే వారి వివరాలను కూడా తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుదరరామిరెడ్డి, ఆర్డీవో కె.చిన్నయ్య, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యులు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు.

రాగి వైర్ల చోరీ ముఠా అరెస్టు

రూ.2 లక్షల విలువైన రాగి తీగ స్వాధీనం



నిందితులను అరెస్టు చేసిన ఆగిరిపల్లి పోలీసులు

ఆగిరిపల్లి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి వాటిలోని రాగి వైర్లను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆగిరిపల్లి పోలీసులు పట్టివేశారు. ఎస్సై నంబూరు చంటిబాబు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నూజివీడులోని మొఘల్ చెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్న పెంట్రాల కోటేశ్వరరావు, రామయ్యరావుపేటకు చెందిన పెండ్ర ఏసుబాబు, ఎన్టీఆర్ కాలనీకి చెందిన పెండ్ర దుర్గారావు ముఠాగా ఏర్పడి వ్యవసాయ భూముల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని రాగి తీగను చోరీ చేసి విక్రయిస్తుంటారు. ఈ నెల 11న సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్సై చంటిబాబుకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి ఆగిరిపల్లిలో విజయవాడ రోడ్డులో ఉన్న సాయిబాబు మందిరం వద్ద అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో చోరీ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వీరు గుంటూరు, ఒంగోలు, నందిగామ, పిడుగురాళ్ల, తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి ప్రాంతాల్లో రాగితీగను చోరీ చేయగా నమోదైన కేసుల్లో జైలు శిక్ష సైతం అనుభవించారు. నిందితుల నుంచి రూ.2 లక్షల విలువైన రాగితీగ, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు.

క్రీడల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం



తణుకులో త్రోబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: క్రీడల ద్వారానే విద్యార్థులలో పోటీతత్వం పెరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అండర్–17 త్రోబాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన క్రీడాకారులతో కలసి మంత్రి, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కలెక్టర్ పి.ప్రశాంతి త్రోబాల్ ఆడి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు గంటల్లోనే బాలిక మిస్సింగ్ కేసు ఛేదింపు



బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఆగిరిపల్లి పోలీసులు

నూజివీడు: బాలిక మిస్సింగ్ కేసును దిశ పోలీసులు కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఛేదించి బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లిలో నివాసం ఉంటున్న తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదని దిశ యాప్‌కు బుధవారం మధ్యాహ్నం 1 గంటకు సమాచారం అందించారు. వెంటనే దిశ పోలీసులు అలర్ట్ అయ్యారు. బాధితుల ఇంటికెళ్లి బాలిక వివరాలు సేకరించి బంధువులు, స్నేహితులను విచారించడంతో పాటు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. టవర్ లోకేషన్, సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా బాలికను ఎక్కడుందో కనిపెట్టారు. కేవలం రెండు గంటల వ్యవధిలోనే విజయవాడలో ఉన్న బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడి హాస్టల్‌కు వెళుతున్నట్టు పోలీసుల విచారణలో బాలిక తెలిపింది. హాస్టల్ వద్ద డ్రాప్ చేయడానికే స్థానిక యువకుడి సహాయం తీసుకున్నట్టుగా పేర్కొంది. దీంతో దిశ పోలీసులు బాలిక, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా పోలీసులకు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిన్న చిన్న కారణాల వల్ల తల్లిదండ్రులతో గొడవపడి వెళ్లడం సరికాదని పోలీసులు బాలికకు హితవు పలికారు. తక్షణం స్పందించడంతో పాటు, రెండు గంటల వ్యవధిలోనే బాలిక మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులను దిశ ఉన్నతాధికారులు అభినందించారు.

15 నుంచి ఘాట్ రోడ్లలో టోల్‌గేట్ల మూసివేత

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ భద్రతలో భాగంగా రాత్రి వేళల్లో రెండు ఘాట్ రోడ్లలోని టోల్ గేట్లను ఈ నెల 15 నుంచి మూసివేయాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. నిత్యం ద్వారకాతిరుమల చినవెంకన్నను వేలాది మంది భక్తులు దర్శిస్తుంటారు. అందులో అధిక శాతం మంది వివిధ వాహనాలపై క్షేత్రానికి వస్తుంటారు. భీమడోలు మీదుగా క్షేత్రానికి వచ్చే భక్తులు కేశఖండనశాల వద్ద ఉన్న ప్రధాన టోల్‌గేటు మీదుగా కొండపైకి చేరుకుంటారు. అలాగే జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మీదుగా వచ్చే భక్తులు దొరసానిపాడు ఘాట్ రోడ్డు మీదుగా, లేదా శ్రీవకుళమాత నిత్యాన్నదాన భవనం సమీపంలో ఉన్న టోల్‌గేట్ మీదుగా కొండపైకి వెళతారు. ఈ టోల్‌గేట్లను వివాహాలు జరిగే సమయంలో ఎక్కువగా వినియోగిస్తారు. ఆలయ భద్రతలో భాగంగా ఈనెల 15 నుంచి దొరసానిపాడు వద్ద, నిత్యాన్నదాన భవనం సమీపంలోని టోల్‌గేట్‌లను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు మూసివేసి, కేశఖండనశాల వద్ద ఉన్న ప్రధాన టోల్‌గేట్ మీదుగా మాత్రమే కొండపైకి భక్తుల వాహనాలను అనుమతించనున్నారు. రాత్రి వేళల్లో మూతపడనున్న టోల్‌గేట్‌ల వద్ద ఇప్పటికే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

కొమ్ముగూడెం సొసైటీ త్రిసభ్య కమిటి సభ్యుడిగా అంజిబాబు



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను కలిసిన సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు అంజిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం సొసైటీ త్రిసభ్యకమిటి సభ్యుడిగా జగ్గన్నపేటకు చెందిన పచ్చా అంజిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన గురువారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించారు. తన నియామకానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, సీఈవో కృష్ణశర్మ, జగ్గన్నపేట గ్రామసర్పంచ్ ములకాల సూర్యారావు, మండల యూత్ అధ్యక్షుడు ములకాల రాంబాబు, పచ్చా లక్ష్మణరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నేత్రపరీక్షలు

అత్తిలి: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా అత్తిలి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎం స్కూల్‌లో విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారు. పాలకొల్లు ఆర్‌ఆర్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు శింగలూరి చంద్రశేఖర్ ప్రారంభించారు. శిబిరంలో 1,250 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా వీరిలో 27 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు యాతం రాంబాబు, ఉలుసు భాస్కరరావు, వర్ధినీడి వెంకట శివ, పట్నాల వెంకటేశ్వరరావు, వడ్డి కొండబాబు, దొడ్డిపట్ల కోటేశ్వరరావు, బి రజని, వై సుజాత, పి సత్యవేణి పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన అవసరం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేస్తున్న హెల్త్ సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): అన్ని వయస్సుల వారిని పట్టి పీడిస్తున్న సుగర్ వ్యాధి పట్ల అవగాహనతో పాటు నియంత్రణ ఎంతో అవసరమని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఆవరణలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ కాళ్ల గోపీకృష్ణ సహకారంతో గురువారం ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షల శిబిరం జరిగింది. హెల్త్ సిబ్బందిచే సుగర్ టెస్టులు అనంతరం హెల్త్ డ్రింక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీ ప్రసాద్, కార్తీక్, కంచర్ల నరసింహ అపర్ణ ప్రసాద్, మురళీకృష్ణ దాసరి వెంకటేశ్వరరావు, సత్యనారాయణరాజు, యర్రా ఆంజనేయస్వామి, యెలిశెట్టి సత్యదేవ్ రామకృష్ణ, గుప్తా పాల్గొన్నారు.

నేడు మందుగుండు సామగ్రి విక్రయదారుల సమావేశం

తాడేపల్లిగూడెం రూరల్: దీపావళి పండుగను పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు దీపావళి మందుగుండు సామగ్రి విక్రయ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపారు. విక్రయ, దుకాణదారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రైలు సర్వీసుల పునరుద్ధరణకు వినతి

భీమవరం (ప్రకాశంచౌక్): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఎ పాటిల్‌కు కొత్త రైళ్లు, పాత రైలు పునరుద్ధరణ కోరుతూ శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి వినతి పత్రాన్ని అందజేశారు. విశాఖపట్నం నుంచి కాశీ వెళ్లే రైలును నరసాపురం మీదుగా నడపాలని, భీమవరం నుంచి బెంగళూరుకు రెండు ఎక్స్‌ప్రెస్‌లను నడపాలని, అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభం అన్నారు గానీ రైలు నడవడం లేదని, ఈ కాశీ ఎక్స్‌ప్రెస్‌ను రెండు రోజులకు ఒకసారి నడపాలని కోరారు. పాత రైళ్లు పునరుద్ధరించాలని, రాజమండ్రికి ప్యాసింజర్ రైలు నడపాలని కోరారు. డబ్లింగ్ లైన్ వేసి భీమవరం రైల్వే స్టేషన్ సుందరీకరణ చేసినప్పటికీ గూడ్స్ రైళ్లు ఎక్కువగా నడవడం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని డీఆర్‌ఎంకు వివరించారు.

వృద్ధులకు పౌష్టికాహారం

భీమవరం అర్బన్: భీమవరం మండలం తాడేరు గ్రామంలోని జడ్డు బ్రహ్మాజీ వృద్ధాశ్రమంలో గురువారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కోడె వీరమ్మ సేవా సమితి ఆధ్వర్యాన సమితి అధ్యక్షుడు కోడె యుగంధర్, విజయలక్ష్మి దంపతులు వృద్ధులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరిచర్ల సత్యనారాయణ, కట్టా రవి, గంటా సుందర్‌కుమార్, గాదిరాజు రామరాజు, కొత్త ధర్మ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం

పల్లెలు, పట్టణాల్లో సురక్ష వైద్య శిబిరాలు



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం, చిత్రంలో ప్రత్యేకాధికారి దుర్గేష్



పెంటపాడు: పరిమెళ్ల సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి హైమావతి

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రోగులు ఉన్నత వైద్యం కోసం ఎక్కడకు వెళ్లినా వారి ఆరోగ్య వివరాలను ఏపీ పోర్టల్‌లో పొందుపర్చడం ద్వారా సులువుగా వైద్యం అందించడానికి వీలుంటుందన్నారు. ఉన్నత స్థాయి వర్గాలు ప్రతి ఏడాది బాడీ చెకప్ పేరిట చేసుకునే తొమ్మిది రకాల పరీక్షలను గ్రామంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో చేయడం జరుగుతుందన్నారు. తద్వారా పేదలకు వారి ఆరోగ్య పరిస్థితి తెలుస్తుందన్నారు. అవసరమైన మందులను నెలకు సరిపడా అందిస్తారన్నారు. అనంతరం వైద్యులు శ్రీహర్ష, సింధూ, స్వాతిశ్రీ, ఆర్.సునీత, పి.కాంచనప్రియ తదితరులు 900మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద ఆరోగ్యకరమైన జీవనానికి ఎటువంటి ఆహారం తీసుకోవాలనే దానిపై రోగులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.శ్రీదేవి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ తులసీదాస్, సచివాలయ కన్వీనర్ కారింకి వీర్రాజు, ఈవోఆర్‌డీ ఎం.వెంకటేష్, పంచాయతీ ఈవో తల్లాప్రగడ రవిచంద్ర, సచివాలయ కార్యదర్శి జక్కిలంక దివ్య, హెచ్‌ఎం ఎస్‌కే.లాల్ బీబీ, సీహెచ్‌వోలు పి.నవ్యలక్ష్మి, డి.ప్రవల్లిక, డి.సత్తిబాబు, ఎస్.నీరజ, నాయకులు ఆలపాటి కాశీవిశ్వేశ్వరరావు, పనమట వెంకటేశ్వరస్వామి, మద్దుకూరి రామావతారం, పసుమర్తి మునీంద్ర, పరిమి ప్రసాద్, ఏఎన్‌ఎంలు డి.రత్నకుమారి, జి.పద్మ, పి.శాంతకుమారి, ఎన్.ఆదిలక్ష్మి, ఆశాలు బి.లుధియానమ్మ, డి.లక్ష్మి, సీహెచ్.సత్యవతి, కే.లక్ష్మి, ఎ.నవరత్నం, కే.రూపాదేవి, ఆరోగ్య మిత్ర ఎస్.సునీత తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

పెంటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు పేదలకు వరమని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం గురువారం పెంటపాడు మండలం పరిమెళ్ల జెడ్పీస్కూల్ వద్ద ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం పరితపిస్తున్నారన్నారు. వైద్యసేవలే పరమావధిగా భావించి నేడు పేదలకు ఇంటింటికీ ఉచిత వైద్యసేవలు చేయిస్తున్న సీఎం జగనన్న అభినందనీయులన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సాంబయ్యలు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇప్పటికే 104 వైద్య సేవల ద్వారా సుగర్ బీపీ, పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారన్నారు. దీనికి అనుబంధంగా ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మందులు అందించి ఇక్కడ నయం కాని వ్యాధులు కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసే ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మండా రామకృష్ణ, గొర్రెల వెంకటేశ్, ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, పార్టీ అధ్యక్షుడు కడియం రాంబాబు, ఏడుకొండలు, తాడి కృష్ణ, తాడి చంద్రం, యనాలపల్లి గ్రామ సర్పంచ్ గోకా ఛాయాదేవి, నాగరాజు, పెంటపాడు, ముదునూరు వైద్యాధికారిణి డాక్టర్ పూజిత, పెంటపాడు వైద్యాధికారి డాక్టర్ తోట రాజేష్, గ్రామ చక్రవర్తి, ప్రత్యేక వైద్యులు ముంతాజ్, ఉన్నీసా కంటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, సీహెచ్‌వో సుజాత, ఫార్మాసిస్టు రాంబాబు, మీసాల సాయిబాబా, మారిశెట్టి తేజోనాథ్, ముదునూరు, పెంటపాడు పీహెచ్‌సీలకు చెందిన వైద్య సిబ్బంది, ఈశ్వరి, మెర్సీ, రజనీరత్నం, నాగమణి, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలతో పాటు, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా వైద్య శిబిరాలు

అత్తిలి: జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని సర్పంచ్ అద్దాల భానులలిత మహాలక్ష్మి అన్నారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతి ఇంటిని జల్లెడ పడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వారికి ఒక్క రూపాయి ఆర్థికభారం లేకుండా వైద్యనిపుణులచే ఉచిత వైద్యసేవలు అందించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి, వారికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. శిబిరంలో 676 మందికి వైద్యపరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమ్మాబత్తుల సత్యనారాయణ, వైద్యులు డాక్టర్ జ్యోతికృష్ణ, డాక్టర్ కె కోటేశ్వరరావు, డాక్టర్ ఎల్ చాముండేశ్వరి, డాక్టర్ కె నాగరాజు, రామిరెడ్డి, ఎంపీటీసీ కూరాకుల లక్ష్మి, ఎంపీడీవో ఎండీ అమీలుజామ తదితరులు పాల్గొన్నారు.

తేతలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని 2వ సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సచివాలయ పరిధిలో మొత్తం 1,011మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో కే కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు, ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతి ప్రియ, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఏఎస్ రామకోటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ టీఎల్ఎస్ హరణి, కేఎంఆర్ కిషోర్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఉమాశంకర్, ఎం సత్యనారాయణ, ఇతర వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పెంటపాడు: ఆరోగ్యసురక్ష శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు



అత్తిలి: స్కిన్నెరపురంలో జరిగిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు నాగరాజు



అత్తిలి: స్కిన్నెరపురంలో వైద్య శిబిరానికి హాజరైన వారికి ఆహారాన్ని అందజేస్తున్న సర్పంచ్

జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాలి

తాడేపల్లిగూడెం: పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.విజయకుమార్ అన్నారు. గురువారం ఏపీ నిట్‌లో నేచర్ వాల్యూ ఎడ్యుకేషన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థిరమైన అభివృద్ధిలో జీవవైవిధ్యం పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో జీవజాలం ఉపయోగపడినంతగా మరే ఇతర ప్రకృతి సంపద మానవులకు ఉపయోగపడదన్నారు. మానవడ ఈ భూమిపై మనుగడ సాగించడానికి అవసరమైన ఆహారం, నివాసం, వనరులు, ఔషధాలు వంటివన్నీ ప్రకృతే సమకూరుస్తుందన్నారు.అభివృద్ధి, ఆధునికీకరణ ప్రభావంతో జీవవైవిధ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ప్రపంచదేశాలన్నీ బయోడైవర్సిటీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. ప్రకృతిలో చోటు చేసుకుంటున్న ఎన్నో మార్పులు , పరిణామాల వల్ల జీవజాతులు, వనరులు కనుమరుగైపోతున్నాయన్నారు. వాటిని కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఓజోన్ పొరతో పాటు కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాలన్నారు. ప్రకృతి వనరులను అవసరానికి మించి వినియోగిస్తే జీవవైవిధ్యానికి నష్టం వాటిల్లకుండా ఆధునిక సాంకేతికతను జోడించి విద్యార్థులు కొత్తకొత్త పద్ధతులను అన్వేషించాలన్నారు. విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ఆచార్యులు వి.సందీప్, క్లబ్ సెక్రటరీ కృష్ణప్రియ పాల్గొన్నారు.



నిట్‌లో జరిగిన కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న సుధామ పౌండేషన్ వ్యవస్థాపకుడు శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.విజయకుమార్ తదితరులు

20న అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆకివీడు సమతనగర్‌లో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున ఆవిష్కరణ చేస్తారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలోని జువ్వలపాలెంలో గురువారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుతో పాటు రాజకీయ పార్టీల ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ వాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బాలకృష్ణ, బంగారమ్మ, చంద్రయ్య, మంగమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

జగనన్న ఆరోగ్య శిబిరం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష తెలిపారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకొంటున్న ఎంపీపీ దాసరి హైమావతి

పెంటపాడు: మండలంలో సాంఘిక సంక్షేమ హస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పెంటపాడు ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. గురువారం ఆమె పరిమెళ్ల గ్రామంలోని ఎస్సీ బాలుర హస్టల్‌ను తనిఖీ చేశారు. హస్టల్‌లో సౌకర్యాలను వెల్ఫేర్ అధికారి కోటిపల్లి రామకృష్ణ ను అడిగితెలుసుకొన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థుల క్రమశిక్షణపట్ల రామకృష్ణను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, గ్రామ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, గ్రామ కార్యదర్శి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కవి ప్రసాద్‌కు ఉత్తమ పురస్కారం

తణుకు: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన కవి పీఎస్‌పీ ప్రసాద్ రచించిన కవితకు అత్యుత్తమ పురస్కారం లభించింది. ఏలూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రక్షించుకుందాం మానవత్వాన్ని శీర్షికతో ప్రసాద్ రచించిన కవితకు ఆహూతుల నుంచి ప్రసంశలు లభించాయి. వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతుల మీదుగా కవి ప్రసాద్‌కు పురస్కారం అందజేసి అభినందించారు.

వైఎస్సార్‌సీపీలోకి రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ ఏజీఎం

తణుకు టౌన్: తణుకు పట్టణానికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గుమ్మాపు రాజశేఖర్ వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం తణుకు సజ్జాపురంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన రాజశేఖర్ గతంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, బీఎస్ఎన్ఎల్ స్టేట్ అడ్వైజర్‌గా, ఆల్ ఇండియా ఎస్సీ వెల్ఫేర్ అడ్వైజర్‌గా పని చేశారు. బీఎస్ఎన్ఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఎస్సీ సెల్‌లో అసిస్టెంట్ లైసెన్స్ ఆఫీస్‌లో కూడా పని చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, నియోజకవర్గ పరిశీలకులు జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు పొట్ల సురేష్, గంటా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో చేరిన గుమ్మాపు రాజశేఖర్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

నేడు పెదతాడేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి వారు ఒక ప్రకటన విడుదల చేశారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పాల్గొనే ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

అఖండ అన్నసమారాధన

అత్తిలి: గణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి పడవల రేవువీధిలో నెలకొల్పిన శ్రీలక్ష్మిగణపతి మందిరం వద్ద గురువారం అఖండ అన్నసమారాధన జరిపారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి మూడు వేలమంది భక్తులు హాజరయ్యారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని 35వ వార్డుకు చెందిన అంపా సత్యనారాయణ (33) గురువారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సత్యనారాయణ స్థానిక ఎఫ్‌సిఐ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు చెబుతున్నారు. పట్టణ ఎస్సై జిజె ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అత్తిలి: మండలంలోని కొమ్మర, అత్తిలి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వార్షిక మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు, డీఈఈ సీహెచ్ రామకృష్ణ తెలిపారు.

ఖర్చు మితం.. పోషణ అమితం

చిరుధాన్యాలతో పౌష్టికాహారం




జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

పెంటపాడు: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకొంటేనే ఎవరికైనా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి రోగాలకు దూరంగా ఉండవచ్చు. సాధారణంగా ఖరీదైన పదార్థాలలోనే పోషక విలువలు ఉంటాయని భావిస్తుంటారు కానీ, మన ఇంట్లో ఉన్న పదార్థాలతోనే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా చిరుధాన్యాలతో వివిధ పదార్థాలను తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. గూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్ నెలలో గణన ప్రకారం గణపవరం, పెంటపాడు, గూడెం మండలం, గూడెం పట్టణంలో 278 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో గర్భిణులు 1427, బాలింతలు1,475, ఆరు నెలల నుంచి సంవత్సరంలోపు చిన్నారులు1,529, సంవత్సరం నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 5,880తో పాటు, 3552 మంది ప్రీస్కూల్ విద్యార్థులు ఉన్నారు.

పోషకాలు అధికం

రాగులు, జొన్నలు, కొర్రలు, గోదుమ తదితర చిరుధాన్యాలలో పోషక విలువలు అధికంగా ఉన్నాయి. వీటిని తీసుకోవడం ద్వారా మనకు సంపూర్ణ పోషణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆకుకూరలు, కాయగూరల ద్వారా విటమిన్లు అందుతాయి. గర్భిణులు, బాలింతలు ఇటువంటి ఆహారం తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకొంటున్నారు. ఈ శిబిరాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. చిరుధాన్యాలతో తయారు చేసుకొనే పదార్థాలను ప్రదర్శిస్తున్నారు. తద్వారా ఇక్కడి కి వచ్చే గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు.


ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ప్రజల ఆరోగ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోంది. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లను అందజేస్తోంది. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంది.

– ఎంపీపీ దాసరి హైమావతి, పెంటపాడుమండలం

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్నాం. బాలామృతం, రాగిపిండి, కంది పప్పు, బియ్యం, బెల్లం, చిక్కీలు, ఎండుఖర్జురం , మంచినూనె, గుడ్లు, పాలు, అందిస్తున్నాం. నెలలో ప్రతి మొదటి మూడు శుక్రవారాల్లో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. సురక్ష శిబిరాల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. తద్వారా ప్రతి వారికి అవగాహన కల్పిస్తున్నాం.

– జీజీబీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పెంటపాడు మండలం